క్లుప్తంగా

సాగర్ కాల్వ కట్టకు బుంగ



రామాపురం సమీపంలో సాగర్ కాల్వ కట్టపై పడిన బుంగ

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం సమీపాన సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ పడింది. దీంతో వచ్చే వానాకాలంలో సాగర్ కాల్వకు నీరు విడుదల చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. కట్టపై బుంగ పడడంతో ప్రస్తుతం ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బంది కరంగా మారింది. సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బూరుగడ్డ ఆలయంలో పంచామృతాభిషేకం



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

హుజూర్‌నగర్ : హనుమాన్ జయంతి సందర్భంగా హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో గల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అన్నదానం, పూజా కార్యక్రమాల నిమిత్తం పలువురు భక్తులు, దాతల నుంచి విరాళంగా బియ్యం, నగదు సేకరించారు. జయంతి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీసీ జనగణన చేపట్టాలి

నడిగూడెం : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మండవ నాగమణి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని రత్నవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ జనగణన చేపట్టి ఆయా కులాల దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 45 శాతం పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గల బీసీ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : అధిక ఫీజులు వసులు చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కీర్తి శివకుమార్ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈ టెక్నో, డీజీ టాలెంటెడ్ అనే పేర్లతో పాఠశాలు నడపవద్దని అన్నారు. నిబంధనలు పాటించని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి వాటిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డొంకదారులు, రోడ్లను కమ్మేసిన కంపచెట్ల తొలగింపు



యాతవాకిళ్ల వద్ద జేసీబీతో కంపచెట్లు తొలగిస్తున్న అధికారులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లు, డొంకదారులకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారాయి. దీంతో శుక్రవారం పంచాయతీ ప్రత్యేక అధికారి సాయిరాం, కార్యదర్శి నరేష్‌లు జేసీబీతో కంపచెట్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్నందున రైతులు, ప్రజలు రోడ్లు, డొంక దారుల గుండా ప్రయాణాలు సాగించేందుకు అనువుగా ఉండేందుకు కంపచెట్లు తొలగించినట్లు తెలిపారు.

నిషేధం అమలయ్యేనా..!

- కోదాడలో యథేచ్ఛగా గుట్కాలు, పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు
- అమాంతం రేట్లు పెంచిన వ్యాపారులు
- ఆ ఇద్దరు వ్యాపారులదే దందా
- నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతున్న ప్రజలు



నిషేధిత గుట్కాలు

కోదాడ : యువత పాలిట శాపంగా మారిన గుట్కాలు, పొగాకు సంబంధ ఉత్పత్తులపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని అధికారులు కఠినంగా అమలు చేస్తారా..? లేక గతంలో మాదిరిగానే గాలికి వదిలేస్తారా..? అనే సందేహం సామాన్యుల్లో నెలకొంది. ఇప్పటికే వీటిపై నిషేధం అమల్లో ఉన్నా మూడు ప్యాకెట్లు, ఆరుదండలు అన్న చందంగా వ్యాపారం సాగుతోంది. ఇవి సులువుగా లభ్యం అవుతుండడంతో యువతతో పాటు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు, హమాలీలు వీటి బారిన పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం నిషేధం విధించడంతో వ్యాపారులు వీటి ధరలను అమాంతం పెంచినట్లు సమాచారం. రెండు రూపాయల ధర ఉంటే ప్రస్తుతం వీటిని 10 రూపాయలకు అమ్ముతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆ ఇద్దరు వ్యాపారులదే దందా..

కోదాడ కేంద్రంగా గుట్కాలతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాల్లో కోదాడకు చెందిన ఇద్దరు వ్యాపారులు కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. పట్టణంలోని నాగుబండి రామ్మూర్తినగర్‌లో నివాసం ఉండే వ్యాపారి ఒకరు, నయానగర్ పబ్లిక్ క్లబ్ సమీపంలో ఉండే మరో వ్యాపారి ఈ దందాలో అన్నీ తామై నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనాల్లో వీరు సరుకు తెప్పించి తెల్లవారే సరికి తమ ఏజెంట్ల ద్వారా గ్రామాల్లోకి చేరవేస్తారు. ఈ దందా బహిరంగంగానే జరుగుతున్నా నెలవారి మామూళ్ల ముసుగులో పట్టించుకొనేవారు కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి వ్యాపారులతో పాటు మరో ఏడెనిమిది మంది ద్వితీయ శ్రేణి వ్యాపారులు ఉన్నారని, వీరిని కట్టడి చేస్తే కోదాడ సమీపంలో గుట్కా వ్యాపారాన్ని సులువుగా అదుపు చేయవచ్చని పలువురు అంటున్నారు.

అధిక లాభాలు వస్తుండడంతో...

హైదరాబాద్‌తో పాటు కర్ణాటకలోని బీదర్ పరిసర ప్రాంతాల నుంచి గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీటిలో రూపాయికి పది రూపాయల ఆదాయం ఉండడంతో ఎన్ని నిర్బంధాలు ఉన్నా వ్యాపారులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు గుట్కా ప్యాకెట్లను చించి వేసి ఎవ్వరికీ అనుమానం రాకుండా తెల్ల కాగితాల్లో, వక్కపొడి ప్యాకెట్లలో పెట్టి అమ్మకాలు చేస్తున్నారని, వీరు 2 రూపాయల ప్యాకెట్‌ను 10 నుంచి 15 రూపాయలకు అమ్ముతున్నారని పలువురు అంటున్నారు. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డు, రంగా థియేటర్ సెంటర్, నయానగర్, ఖమ్మం క్రాస్ రోడ్డులలో కొన్ని పాన్ డబ్బాల వారు గుట్కాల అమ్మకం కోసమే తెల్లవారు జామునే దుకాణాలను తెరుస్తుంటారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు గుట్కాలు, పొగాలు ఉత్పత్తుల నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటుట ఆ వ్యాపారంలో కీలకంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలల బలోపేతానికి భాగస్వాములు కావాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నిర్వహణ, బడిబాటపై నిర్వహించిన అన్ని శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని పలు పాఠశాలల్లో జరగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఈ నెల 7లోపు పూర్తి చేయాలని, ఈ నెల 3 నుంచి 19వరకు జరగబోయే బడిబాటలో రెవెన్యూ, పంచాయతీ, శిశు సంక్షేమ, అంగన్‌వాడీ, విద్యాశాఖతో సమన్వయమై భాగస్వాములు కావాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులను తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ సలీంషరీఫ్, తహసీల్దార్ సాయాగౌడ్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, సీఐ రాము, మెప్మా పీడీలు, ఏసీఎంలు, ఎంపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

9న హుజూర్‌నగర్‌లో కంఠమహేశ్వరస్వామి పండుగ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో జూన్ 9వ తేదీన గౌడ కులదైవం శ్రీకంఠమహేశ్వరస్వామి పండుగను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ కుల పెద్దలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలో గౌడ కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉపాధి హామీలో అవకతవకలపై ఫిర్యాదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం తమ్మారం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామనికి చెందిన పలువురు శుక్రవారం సూర్యాపేటలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ధూమపానం నిర్మూలించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు ధూమపానానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధూమపానానికి బానిసలై అనేక మంది ఊపిరితిత్తుల సంబంధిత, క్యాన్సర్ వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించి ధూమపానంకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవల్లి సత్యనారాయణరెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జోసఫ్, విశ్వనాథం, వీరారెడ్డి, ఏసు తదితరులు ఉన్నారు.

బడిబాట విజయవంతానికి కృషిచేయాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పవన్‌కుమార్



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కవిత



నడిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇమామ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : బడిబాట విజయవంతానికి అందరూ కలిసి కృషి చేయాలని ఎంపీడీఓ పవన్‌కుమార్ అన్నారు. చింతలపాలెంలోని రైతు వేదికలో బడిబాట కార్యక్రమం అమలుపై శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, డీఆర్‌పీ ఉపేందర్, హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఓలు, తదితరులు పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి

గరిడేపల్లి : ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కవిత, ఎంఈఓ ఛత్రునాయక్ కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీవోఏలు, సీఆర్పీలు, ఎస్ఆర్పీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు అందజేయాలని తెలిపారు. జూన్ 2న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఎం.సువర్ణ, శ్రీనివాస రావు, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, దీప్తి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

నడిగూడెం : వచ్చే విద్యా సంవత్సరంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్ కోరారు. శుక్రవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో బడి బాట కార్యక్రమంపై నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి రామారావు, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ రంగారావు, నడిగూడెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శోభన్‌బాబు, ఏపీఎం రామలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్‌లు గోవర్ధన్, గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మునగాలలో విత్తనాల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ శిరీష



కోదాడరూరల్ : విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

మునగాల : కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష హెచ్చరించారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను స్థానిక వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో కలిసి ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, వారు కొనుగోలు చేసిన వాటికి విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. విత్తనాల అమ్మకాలకు సంబంధించి బిల్లులు తప్పకుండా రాయాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, రోజువారిగా విక్రయించే వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. విత్తనాల లభ్యత వివరాలను దుకాణాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాలో సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.అనిల్‌కుమార్, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ తప్పదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్టు తప్పదని జిల్లా ఉద్యావన శాఖ అధికారి నాగయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి అన్నారు. శుక్రవారం చింతలపాలెంలోని రైతు వేదికలో నకిలీ విత్తనాలపై డీలర్లకు, నర్సరీ నిర్వాహకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రిజిస్ట్రేషన్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు అమ్మకాలు జరపాలని అన్నారు. అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేయగానే డీలర్లు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. అనంతరం పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల వ్యవసాయధికారి శ్రీనివాస్‌గౌడ్, మండల ఉద్యానశాఖ అధికారి అనిత, చింతలపాలెం, మేళ్లచెరువు ఎస్ఐలు సైదిరెడ్డి, పరమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంధ్య, రియాజ్, మిర్చి, నర్సరీల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి : ఆర్డీఓ

కోదాడరూరల్ : రైతులకు నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ సూర్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో పోలీస్, వ్యవసాయాధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో విత్తనాల స్టాక్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు నాణ్యమైన, పేరున్న కంపెనీల విత్తనాలనే రైతులకు విక్రయించాలని సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులకు విధిగా రశీదు ఇవ్వాలని, సీజన్‌కు సంబంధించిన విత్తనాలు అన్ని సరిపడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. నకిలీ విత్తనాలు ఎక్కడైన విక్రయిస్తే రైతులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ సాయాగౌడ్, ఏఓ పాలెం రజిని, సీఐ రాము, డీలర్లు, రైతులు ఉన్నారు.

రైతులు విధిగా రశీదు తీసుకోవాలి

మేళ్లచెరువు : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సంధ్యారాణి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విత్తనాలు విక్రయిస్తే టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలు కొన్న దగ్గర రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. రైతులు ఆంధ్రా ప్రాంతం నుంచి విత్తనాలు కొనుగోలు చేసి దిగుబడులు రాక నష్టపోయారని, అలా నాణ్యతలేని విత్తనాలు కొని మోసపోవద్దన్నారు. ఆమె వెంట తహసీల్దార్ జ్యోతి, ఎస్ఐ పరమేష్ దితరులు ఏన్నారు.

సరైన ప్యాకింగ్ లేని విత్తనాలు విక్రయించొద్దు

హుజూర్‌నగర్ : సరైన ప్యాకింగ్ లేని విత్తనాలు విక్రయించొద్దని, అలాంటివి అమ్మితే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి స్వర్ణ అన్నారు. శుక్రవారం టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన డీలర్లు విత్తనాల రికార్డులను సరైన పద్ధతిలో నిర్వహించాలని చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. విత్తనాల స్టాక్ బోర్డు ప్రదర్శించాలని ఆమె సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. టాస్క్ ఫోర్సు టీంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.



మేళ్లచెరువు : విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సంధ్యారాణి



హుజూర్‌నగర్ : విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి

ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే..



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి : రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంతో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం మఠంపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ నాయకుడు ఊదర వెంకన్నలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో చేసిన పరిపాలన ఆటవిక పాలనని విమర్శించారు. పోన్‌ట్యాపింగ్ నేరంతో నేడు ఉన్నతాధికారులు ఊచలు లెక్కపెట్టడం గత పాలకుల పుణ్యమేనని, ఇది వారి రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. చైతన్యవంతమైన తెలంగాణ యువత బీఆర్‌ఎస్ నేతలను ప్రశ్నించాలని ఆయన అన్నారు.

ఘనంగా లక్ష మల్లెల పుష్పార్చన



సూర్యాపేట : పూజలు చేస్తున్న భక్తులు



భానుపురి : పూజల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పిల్లలమర్రిలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామికి లక్ష మల్లె పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దరూరి వెంకట రాఘవా చార్యులు, ఆలయ ధర్మకర్త గవ్వ కృష్ణారెడ్డి మాట్లాడారు. అతి పురాతన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో లోక రక్షణార్థం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యం అని పేర్కొన్నారు. లక్ష మల్లె పుష్పార్చన కార్యక్రమానికి దాతలు బ్రహ్మదేవర సీతయ్యకళావతి దంపతులు సహకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దరూరి సింగరాచార్యులు, రామానుజాచార్యులు, రఘువరన్ ఆచార్యులు, అబ్బూరి వినోద్, శ్యామల, జానిమియా, సికిర వీరేశం, సరస్వతి, ముకుందం, నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

భానుపురి : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష మల్లెల అర్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు సామూహికంగా మల్లెల అర్చన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కొత్త వెంకటేశ్వర్లు, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం

సూర్యాపేట : పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని వెన్నెల ఆస్పత్రి డాక్టర్ మామిడి నరేష్ అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెన్నెల ఆస్పత్రి నిర్వాహకులు బయ్య నారాయణ, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సూర్యక్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ శివారులోని సూర్యక్షేత్రం ఆవరణలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి శుక్రవారం తెలిపారు. హనుమాన్ ఆలయంలో హనుమత్ జయంతి, శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శ్రీకాంత్‌యాదవ్‌కు నివాళి

అర్వపల్లి : హైదరాబాద్ సీఐ ఎల్లంల మన్మోహన్ యాదవ్ సోదరుడు, రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు ఎల్లంల శ్రీకాంత్‌యాదవ్ తృతీయ వర్ధంతిని శుక్రవారం జాజిరెడ్డిగూడెంలోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ చిత్రపటానికి అతడి కుటుంబ సభ్యులు, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ పీఈటీ ఎల్లంల కొమిరెల్లి–భారతమ్మ దంపతులు, కోమలత, టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అల్వాల రమేష్, మామిడి నాగరాజు, పగిడిమర్రి శేఖర్, మాదగాని సుదర్శన్, డి. శంకరాచారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాగు భూమిలోకి మురుగునీరు

- పంట నష్టపోతున్నామని రైతు ఆవేదన



సాగుభూమిలోకి ఉన్న మురుగుకాలువ

మునగాల : మునగాల గ్రామపంచాయతీ పరిధిలోని 13, 14 వార్డుల్లో గల పలు వీధుల నుంచి మురుగునీరు గ్రామ శివారులోని పంట భూములకు వచ్చి చేరుతుండడంతో తాము పంట నష్టపోతున్నామని బాధిత రైతు నర్రా ఇంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల ఆయా వీధుల నుంచి మురుగు కాలువలు తన పొలం వరకు నిర్మించి వదిలివేయడంతో మురుగు నీరు పొలంలోకి చేరి సుమారు రెండెకరాల భూమి సాగుకు అనుకూలంగా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు చెరువు కాలువకు వెళ్లేవిధంగా మురుగుకాలువలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. తహసీల్దార్ పరిశీలించి మురుగునీరు చెరువుకాలువలకు పోయేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈమేరకు తహసీల్దార్‌కు దరఖాస్తు అందజేసినట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డు వెడల్పులో భాగంగా నేరేడుచర్ల టౌన్– 1 ఫీడర్ చానల్ పరిధిలోని రాఘవేంద్ర మిల్లు, యూనియన్ బ్యాంకు పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ కింద కరెంటు స్తంభాలు మారుస్తున్నందున శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు. అనంతరం జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో చెరువులు, కుంటల మట్టిని కొందరు దళారులు తరలిస్తున్నారని, అలాగే దళారులు రైతులతో కుమ్మక్కై చెరువు శిఖం భూములను ఆక్రమిస్తుంటే ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తును వదలడం లేదని ఇరిగేషన్ ఏఈ తుమ్మల శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య, మండల వైద్యాధికారి పుష్పలత, ఎంఈఓ సైదానాయక్, పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, ఎంపీఓ శైలజ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవం

మోతె : మండల కేంద్రంలో కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారంకంఠమహేశ్వరస్వామి సురమాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జలబిందెలతో ఆలయానికి తరలివచ్చి స్వామివార్లకు అభిషేకం చేశారు. శివపార్వతులకు పూజలు చేశారు. శనివారం బోనాల మహోత్సవం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.